ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల


జిల్లా వార్తలు

5★★★

ఆదివారం 7 ఏప్రిల్ 2024

రైతుల పక్షాన మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదు - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ 8

నేతన్నలు ధైర్యం వీడొద్దు 7





నిబంధనలకు నీళ్లు

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్లు
- రోగాల పాలు చేస్తున్న డబ్బా నీళ్ల వ్యాపారం
- జిల్లాలో ఇష్టారాజ్యంగా వాటర్ ప్లాంట్‌లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

నీటి శుద్ధి పేరిట దోపిడీ జరుగుతోంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తూ జనాన్ని మోసం చేస్తున్నారు. నిబంధనలకు నీళ్లు ఒదు లుతున్నారు. ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా శుద్ధ జలాలు అందిస్తున్నా జిల్లా ప్రజలు మాత్రం ఎక్కువ సంఖ్యలో ప్యూరిఫైరిడ్ వాటర్‌గా భావిస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామ పంచాయతీ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఐఎస్ఐ నిబంధనలు పాటించకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు మినరల్ వాటర్‌తో మోసపోతూనే ఉన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోనే 120కు పైగా ఉండగా జిల్లాలోని మండలాలు గ్రామాల్లో కలుపుకుంటే 800 వరకు వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయి. గల్లీకో వాటర్ ప్లాంటే కాకుండా ఇళ్లలో కూడా ప్లాంట్‌లు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. నీటి శుద్ధతపై పర్యవేక్షణ లేకపోవడంతో పట్టించుకునే వారే కరువయ్యారు. మున్సిపల్ అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

● పాటించని శుభ్రత

నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్‌లలో నీటి శుద్ధి జరుగుతున్నట్లు తెలుస్తున్నా కనీసం నీళ్లకు ఉపయోగించే డబ్బాలను కూడా శుభ్రం చేయడం లేదు. వాటినే యథావిధిగా ఉపయోగించడంతో క్యాన్లలో ఫంగస్ ఏర్పడి రోగాల బారిన పడుతున్నారు. ఇళ్లలో ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ల నిర్వహణ కూడా పట్టించుకునే వారే లేకపోవడంతో నిర్వాహకులకు ఇష్టారాజ్యంగా మారింది. నిత్యం ఇళ్లలో వాడే వాటర్ క్యాన్‌లు రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరు ప్రజలను అనారోగ్యం పాలు జేస్తోంది.

● అనుమతులు లేకుండానే..

మినరల్ వాటర్ పేరిట నిబంధనలకు వ్యాపారులు నీళ్లు వదులుతున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు బీఐఎస్, ఐఎస్ఐ నుంచి సర్టిఫికెట్లు పొందాలి. వాల్టా చట్టం కింద భూగర్భ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. మున్సిపల్, గ్రామ పంచాయతీ, రెవెన్యూ, కార్మిక, కాలుష్యమండలి, ప్రజారోగ్య, తూనికలు, కొలతలు, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్, విద్యుత్, వాణిజ్య పన్నుల శాఖల నుంచి అనుమతులు ఉండాలి. ఈ అనుమతులేవి పాటించడం లేదు. దీంతోపాటు ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు సంబంధించిన నిబంధనల ప్రకారం ఫుడ్ కంట్రోలర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు ప్లాంట్‌ను సీజ్ చేసి క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయవచ్చు. కానీ సిరిసిల్లతో పాటు గ్రామాల్లో కూడా అనుమతులు లేకుండానే ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. నీటిలో అత్యధికంగా టోటల్ డిజాల్వ్ సాలీడ్స్ (టీడీఎస్) పరిమితికి మించి ఉంటే ఆ నీటిని విషతుల్యంగానే భావిస్తారు. ఆ నీరు తాగితే మూత్రపిండాలు, జీర్ణవ్యవస్థ దెబ్బతింటాయి. అనారోగ్య పరిస్థితులు ఎదుర్కొంటారు. పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్న ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు బోరుకు మోటార్లు వేస్తూ రివర్స్ ఆస్మోసిస్ పద్ధతిలో జలాలను శుభ్రపరుస్తూ విక్రయిస్తున్నారు. వృథా నీటిలో టీడీఎస్ ఉంటుంది. భూగర్భ జలాల్లోకి పంపడ, డ్రైనేజీల్లో కలవడం ద్వారా నష్టానే కలిగిస్తాయి. వస్తున్న నీటిని డ్రై బెడ్స్‌లో కేక్‌గా మార్చి పారబోయాల్సి ఉంటుంది. ఇందుకు ప్లాంట్ విశాలమైన ప్రాంతంలో ఏర్పాటు చేయాలి. ఇళ్ల మధ్య ఉండడం ద్వారా ఇలాంటివి ఎవరూ పాటించడం లేదు. అధికారులు కూడా తనిఖీలు చేయడం లేదు. ప్లాంట్లలో కూడా రసాయనాలు ఇష్టారాజ్యంగా ఉపయోగిస్తున్నారు.

పెద్దమ్మ ఉత్సవాల్లో కేటీఆర్

ముస్తాబాద్, ఏప్రిల్ 6 : మండలంలోని పోతుగల్‌లో ముదిరాజ్ సామాజిక వర్గం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఎమ్మెల్యే కే తారకరామరావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ పెద్దిరాజు కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు బాపురావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ద్యావతి పందరి, తన్నీరు గౌతంరావు, పారిపెల్లి శ్రీనివాస్ ముదిరాజ్ సామాజిక వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా చేపట్టాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 6 : జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా నిర్వాహకులు చూడాలని డీఆర్‌డీవో శేషాద్రి కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ఏపీఎంలు, కేంద్రాల ఇన్‌చార్జిలు, బుక్ కీపర్ల, కమిటీల సభ్యులకు శిక్షణ అందించారు. డీఆర్‌డీవో శాఖ కేటాయించిన 44 ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో శేషాద్రి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్యాడీ క్లీనర్ ద్వారా పట్టిన ధాన్యాన్ని సంబంధిత ఏఈవో సర్టిపై చేసిన మాత్రమే కొనుగోలు చేయాలని అన్నారు. కేటాయించిన రైస్‌మిల్లులకు మాత్రమేధాన్యాన్ని పంపించాలన్నారు. కేంద్రంలో సమస్యలు రాకుండా సజావుగా సాగేలా చూసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ సౌకర్యంతో పాటు తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా పౌర సరఫరా మేనేజర్ జితేందర్ ప్రసాద్, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీఎం పాపారావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, జిల్లా సమాఖ్య కార్యదర్శి రజిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శని త్రయోదశి పూజలు

వేములవాడ, ఏప్రిల్ 6 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన నవగ్రహ ఆలయంలో శని త్రయోదశి పూజలు ఘనంగా నిర్వహించారు. శనివారం త్రయోదశి కలిసి రావడంతో భక్తులు నవగ్రహ మంటపంలోని శనీశ్వరుడిని తైలంతో అభిషేకించారు. నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పూజలలో పాల్గొన్నారు.

నేతన్నలు చనిపోతున్నా చలించరా?

సిరిసిల్ల రూరల్ ఏప్రిల్ 6: 'వస్త్ర పరిశ్రమలు మూతబడి నెలలు గడుస్తున్నా పట్టించుకోరా? తినడానికి తిండిలేక నేతన్నలు చనిపోతున్నా చలించరా? ఆదుకోవాల్సిన పాలకులు రాజకీయాలకే పరిమితమవుతారా? అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో ఆత్మహత్య చేసుకున్న సిరిపురం లక్ష్మీనారాయణ భౌతిక దేహానికి శనివారం రాత్రి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు. ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న లక్ష్మీనారాయణ కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్మీనారాయణ కుటుంబ ఆర్థిక పరిస్థితిని చూస్తే బాధ అనిపిస్తోందని, కుటుంబాన్ని పోషించలేక లక్ష్మీనారాయణ ఆత్మహత్య చేసుకోవడం కలిచివేసిందని అన్నారు. లక్ష్మీనారాయణ భార్య అనారోగ్యంతో బాధపడుతోందని, తినడానికి తిండిలేని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. ఆత్మహత్యలు కూడా కామన్‌గా మారే పరిస్థితి రావడం దౌర్భాగ్యమని, మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కూడా నేతన్నలను పట్టించు కోలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. దీంతో వస్త్రపరిశ్రమలు మూతపడ్డాయన్నారు. తమను ఆదుకోవాలని మూడు నెలలుగా నేతన్నలు ఆందోళన చేస్తున్నారని, చివరకు భిక్షాటన చేసి నిరసన తెలిపినా ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, తక్షణమే చనిపోయిన లక్ష్మీనారాయణ కుటుం బాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ చీరల బకాయిలు రూ. 270 కోట్లు చెల్లించడంతోపాటు కొత్త ఆర్డర్లు ఇచ్చి వస్త్ర పరిశ్రమ యథావిధిగా కొనసాగేలా చూడాలన్నారు. 50 శాతం విద్యుత్ సబ్సిడీని పునరుద్ధరించాలని, యారన్ సబ్సిడీని కొనసాగించడంతో పాటు వర్కర్ టు ఓనర్ పథకాన్ని ప్రారంభించాలని అన్నారు. నేతన్నలను ఆదుకోవాలని గతంలో సీఎంకు లేఖ రాశానని, స్పందన రాలేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు ఈనెల 10న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సిరిసిల్లలో 'దీక్ష' చేయాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ దీక్షకు సంఘీభావం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, కైలాస్, అనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న బండి సంజయ్

పవర్‌లూం కార్మికుడి బలవన్మరణం

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 6: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన పవర్‌లూం కార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ (66) ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లాలోని వస్త్ర పరిశ్రమలో సంక్షోభంతో మరమగ్గాలు మూతపడ్డాయి. పనులు లేక నేతన్నల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గత నెలలో తడుక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం కూడా జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన పవర్‌లూం కార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకున్నాడు. 12ఏళ్ల క్రితం ఇక్కడ పనుల్లేక సిరిసిల్ల నుంచి భీవండికి వలస వెళ్లిన లక్ష్మీనారాయణ అక్కడ పనిచేస్తుండగా కాలికి గాయమై 10ఏళ్లక్రితం సిరిసిల్లకు వచ్చి పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వారంలో నాలుగు రోజులు పనికి వెళ్లేది. నాలుగేళ్ల క్రితం భార్య వజ్రవ్వకు పక్షవాతం వచ్చింది. ఇద్దరి వైద్య చికిత్సకు రూ.5లక్షల ఖర్చయ్యాయి. మందులకు ప్రతి నెల రూ.10వేల వెచ్చించాలి. రెండు నెలలుగా సిరిసిల్లలో వస్త్రపరిశ్రమ సంక్షోభంతో మరమగ్గాలు మూతపడ్డాయి. దీంతో ఆ నేత కార్మికుడి కుటుంబానికి పనికరువైంది. పనిలేక చేతిలో చిల్లి గవ్వలేకుండా పోయింది. మందులు కొనుగోలుకు స్తోమత లేకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. రెండు రోజుల క్రితం భార్య వజ్రవ్వ తంగళ్లపల్లి మండలంలోని పద్మనగర్‌లో ఉంటున్న కుమారుడు నవీన్ వద్దకు వెళ్లింది. వజ్రవ్వకు భర్త లక్ష్మీనారాయణ శుక్రవారం రాత్రి ఫోన్‌చేసి ఇంటికి రమ్మని చెప్పడంతో శనివారం మధ్యాహ్నం భార్య ఇంటికి వచ్చేసరికి భర్త ఉరివేసుకొని కనిపించాడు. లక్ష్మీనారాయణ పెద్దకుమారుడు నవీన్ రెండు నెలల క్రితం వరకు టెక్స్‌టైల్ పార్క్‌లో పవర్‌లూం కార్మికుడిగా పనిచేశాడు. రెండు నెలలుగా పనులు లేక పద్మనగర్‌లో హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. చిన్నకుమారుడు వేణు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా ఆ ఉద్యోగం కోల్పోయాడు. పనుల్లేక ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో మనస్తాపం చెంది లక్ష్మీనారాయణ ఆత్మహత్యకు చేసుకున్నట్లు కుమారుడు నవీన్ పోలీసులకు ఫిర్యాద ఎచేశాడు. ఈ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.



లక్ష్మీనారాయణ(ఫైల్)

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ఆత్మహత్య చేసుకున్న పవర్‌లూం కార్మికుడు లక్ష్మీనారాయణ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. పార్టీ తరఫున చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనే ఎల్లప్ప నాయకులు రూ.10వేలు అందజేశారు.

నేతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలి

నేతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న లక్ష్మీనారాయణ మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ పరంగా రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. వైద్య పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నేతన్న కుటుంబానికి ప్రభుత్వం తరుపున రావాల్సిన ఆర్థిక సహాయం, బీమాను వెంటనే ఇవ్వాలని, కుటుంబంలో ఉద్యోగం కోల్పోయిన చిన్నకుమారుడికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని కలెక్టర్ అనురాగ్ జయంతికి అక్కడి నుంచే ఫోన్‌చేసి కోరగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. కేటీఆర్ వెంట సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, పద్మశాలీయువజ సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్, బుర్ర లక్ష్మీ, రాజేశం, మల్లికార్జున్, బాలయ్య, రమేష్ ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేటీఆర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 6: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సైబర్ నేరాలపై వివరాలు వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌లు, మెస్సేజ్‌లు క్లిక్‌చేసి మోసపోవద్దన్నారు. జిల్లాలో వారం రోజుల్లో పలువురు సైబర్ మోసాలకు గురయ్యారన్నారు. సిరిసిల్ల పట్టణంలో ఓ బాధితుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఐపీఎల్ టికెట్స్‌సేల్ అనే లింకు చూసి మెస్సెజ్ చేశాడని, టికెట్స్ కోసం డబ్బులు పంపమని చెప్పడంతో వెంటనే రూ.32వేలు పంపి మోసపోయాడని అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని మరో బాధితుడు పార్ట్‌టైం జాబ్ పేరిట ఆన్‌లైన్‌లో డబ్బులు సంపాదించవచ్చని టాస్కులు చేసి రూ.లక్ష పెట్టుబడి పెట్టి మోసపోయాడన్నారు. వేములవాడ పట్టణంలో ఓ బాధితుడు ఓఎల్ఎక్స్‌లో సోఫా కొనుగోలు చేసేందుకు ప్రయత్నించి క్యూఆర్ కోడ్ ద్వారా రూ.98వేలు పంపించాడన్నారు. గంభీరావుపేటలో ఓ బాధితుడు ఫేస్‌బుక్‌లో ఈ-కామర్స్ పేరిట ఓ లింక్‌చేసి రూ. 5వేలు పంపి మోసపోయాడన్నారు. ఎవరైనా మోసపోతే హెల్ప్‌లైన్ నంబరు 1930, డయల్ 100కి కాల్ చేసి చెప్పాలని తెలిపారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 6: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని రెండో బైపాస్ రోడ్డులో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలు తెలిస్తే సమాజంలో జరిగే అన్యాయాలపై ప్రజలను చైతన్యవంతులను చేయవచ్చన్నారు. 0-14సంవత్సరాల లోపు పిల్లలందరూ పనికి వెళ్లకుండా బడిలోనే ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంగా విద్యార్థినులపై అఘాయిత్యాలు పెరిగాయని, వాటిని నివారించడానికి కృషిచేయాలని అన్నారు. బాలికలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకునే విధంగా పోక్సో చట్టం అమలులో ఉందన్నారు. ప్రతీ ఒక్కరు చట్టాలను సద్వినియోగం చేసు కోవాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటే అన్యాయాలు, అక్రమాలు తగ్గుతాయన్నారు. ఈ సదస్సులో ప్రభుత్వ మెడికల్ కళాశాల హెచ్‌వోడి అన్వర్ ఉన్నిసా, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, బూరకళ్యాణీ, పర్శరాములు, ఆంజనేయులు, వేణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ

లక్ష్మీనారాయణ పనిలేక మరణించలేదు

- ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి
- చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్

సిరిసిల్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం రాజీవ్‌నగర్‌లో పవర్‌లూం కార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ (66) వృత్తిలో పనిలేక మరణించలేదని చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక విచారణలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. పవర్‌లూం కాటన్ కార్మికుడిగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ కాలు ఇన్‌ఫెక్షన్ అయ్యిందని, అతడి భార్యకు పక్ష వాతం వచ్చిందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకున్నట్లు తెలిపారు. లక్ష్మీనారాయణకు సొంత పెంకుటిల్లు ఉందని, రూ.2 లక్షల అప్పులు ఉన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. మొదటి కుమారుడు తంగళ్లపల్లిలో ఉంటున్నాడని, రెండో కుమారుడు హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడని తెలిపారు.

నేతన్నల సమస్యలపై దీక్షలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలు మళ్లీ జరుగుతున్నాయని, నేతన్నల సమస్యలపై దీక్షలు చేపడుతామని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ భవన్, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వద్ద సిరిసిల్ల నియోజకర్గ స్థాయి రైతు దీక్ష నిర్వహించారు. సిరిసిల్ల దీక్షలో మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు, నేతన్నలు అవస్థలు పడుతున్నారని, సిరిసిల్ల రాజీవ్‌నగర్‌లో మరో కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడని రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదని అన్నారు. సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల్‌తోపాటు రాష్ట్రంలో నేత కార్మికులు ఉన్న ప్రతీ చోట దీక్షలు చేస్తామన్నారు. యువకులను కూడగట్టి ఉద్యోగాలకోసం పోరాటం చేస్తామన్నారు. రైతులు, నేతన్నల గొంతు వినబడాలన్నా మన తెలంగాణ గొంతు వినబడాలన్నా పోరాటం చేయాలన్నారు. ముఖ్యమంత్రి గుంపు మేస్త్రీ, ప్రధానమంత్రి తాపీ మేస్త్రీ అని, ఇద్దరు కలిసి తెలంగాణ గొంతు బంద్ చేయాలని, సమాధి కట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణను కాపాడుకుందామా.. ప్రజలు, రైతుల తరఫున కొట్లాడుదామా, లేక వారి కుట్రలకు బలి అవుదామా ఆలోచించాలన్నారు.

వ్యవసాయ సంక్షోభం.. గడ్డు పరిస్థితులు

తెలంగాణలో వ్యవసాయ సంక్షోభం, గడ్డు పరిస్థితులపై మన ప్రభుత్వం పోయిన నాలుగు నెలల్లోనే మాట్లాడుకునే పరిస్థితి వస్తుందనే ఆలోచనే బాధకరంగా ఉందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఏడు పదుల వయసులో తనకు ఆరోగ్యం బాగా లేకపోయినా, ఎర్రటి ఎండలు ఉన్నా జనగామ, సూర్యాపేట, నల్లగొండ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు స్వయంగా వచ్చి రైతులను కలిసి ధైర్యాన్ని ఇచ్చారని అదే బాటలో రాష్ట్రంలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో గులాబీ నాయకులు రైతన్నలకు మేమున్నామని దీక్షలు చేపట్టామని అన్నారు. రూ.500 బోనస్ అడిగితే ఎన్నికల కోడ్ వచ్చిందని కుంటి సాకులు చెబుతున్నారని, కోడ్ రాకముందే జీవో ఇవ్వాలని అడిగితే తప్పించుకున్నారని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలన్నారు. ఎన్నికల కమిషన్ వద్దంటే కొనుగోలు కేంద్రాల వద్ద వ్యవసాయ అధికారులకు చెప్పి లెక్కలు రాయించి మే 13 తరువాత రైతులకు బకాయిలు చెల్లించాలన్నారు. ప్రజలు మోసపోయి ఇబ్బంది పడుతుంటే ముఖ్యమంత్రి, మంత్రులకు తెలివి తక్కువతనంగా మాట్లాడుతున్నారన్నారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువు

ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువని, పోయిన వర్షాకాలంలో వర్షాలు బాగపడి చెరువులు, ప్రాజెక్టులు నిండాయని, అధికారంలోంచి దిగిపోయిన నాడు సుభిక్షంగానే తెలంగాణను వాళ్లకు అప్పగించామని కేటీఆర్ అన్నారు. 7 వేల కోట్లు రైతు బంధు కోసం జమ చేసి ఉంచామని, కానీ ఓడిపోయామని అన్నారు. 300 పిల్లర్ల కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రెండు పిల్లర్ల వద్ద సమస్య వచ్చిందన్నారు. ఇటీవల బీహార్ ఒక బ్రిడ్జి కడుతుంటే ఇసుక కదిలి బ్రిడ్జి కూలిపోయిందని, మోదీ రాష్ట్రమైన గుజరాత్‌లో మార్బీ దగ్గర బ్రిడ్జి కూలిపోతే 190 మంది చనిపోయారని అన్నారు. మన దగ్గర ఇసుక కదిలి రెండు పిల్లర్లు కుంగితే దానిని బాగు చేయకుండా కాంగ్రెసోళ్లు కేసీఆర్‌ను బదనాం చేయాలని చేస్తున్నట్లు చెప్పారు. పంటలు ఎండితే కొనే అవసరం లేదని, బోనస్ ఇచ్చుడు అవసరం లేదని చూస్తున్నారన్నారు. కేసీఆర్ కాలు బయట పెట్టగానే కొట్టుకుపోయిందనుకున్న కాలేశ్వరం గాయత్రి, నంది పంప్‌లు ఎట్లా చాల్ అయ్యాయన్నారు. చొప్పదండికి నీళ్లు ఏట్లా వచ్చాయన్నారు. లంగలు, దొంగలు యూట్యూబ్‌ల్లో మాట్లాడే చిల్లరగాళ్ల మాటలు నమ్మవద్దన్నారు. మన కళ్లకు కనిపిస్తున్న వాస్తవాలే నమ్మాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ నీళ్ల కోస కొట్లాడితే అరెస్ట్ చేశారని, నీళ్లు మాత్రం సాయంత్రం వరకే ఇచ్చారని అన్నారు. 110 రోజుల నుంచి ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని, అరచేతిలో వైకుంఠం చూపి 420 హామీలతో ప్రజలను బురిడికొట్టి గెలిచారని అన్నారు. రుణమాఫీ చేయకపోగా బ్యాంకుల వాళ్లు నోటీసులు ఇస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మనం మేల్కోకపోతే, మర్లపడకపోతే పార్టీకి, రైతాంగానికి నష్టం జరుగుతుందన్నారు. అన్నం వడ్డినం వడ్డించే తెలివి కూడా కాంగ్రెస్ వాళ్లకు లేదన్నారు. కాళేశ్వరం, మిషన్‌భగీరథను వాడుకునే తెలివి లేదని అన్నారు. ముఖ్యమంత్రి ఆగమాగం అవుతున్నారని ప్రభుత్వాన్ని కూలగొడుతున్నారని గొంతు చించుకుంటున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి మొగోని వైతే రూ.2 లక్షల రుణమాఫీ, పంటలకు రూ. 500 బోనస్, మహాలక్ష్మీ కింద రూ.2500 ఆడబిడ్డలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముసలోళ్లకు ఇద్దరికి కలిపి రూ.8 వేలు ఇవ్వాలన్నారు. కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించిన కాగితాలు ఇస్తూ 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటున్నారన్నారు. గ్రామాల వారీగా పంట నష్టాన్ని అంచనావేసి ఎకరానికి రూ.25 వేలు పరిహారం చెల్లించాలన్నారు. ఈటల రాజేందర్ కాంగ్రెస్ రుణమాఫీ చేస్తలేదని మాట్లాడుతున్నాడని బీజేపీ రుణమాఫీ గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని అన్నారు. మోదీ రైతులకు వ్యతిరేకమని, నల్లచట్టాలు తెచ్చారని అన్నారు. నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ నాయకులు దరువు ఎల్లం, మాట్ల తిరుపతి, బొల్లి రామ్మోహన్, వరుస కృష్ణహరి, పూసపెల్లి సరస్వతి, కమలాకర్‌రెడ్డి, సురేందర్‌రావు, పాపగారి వెంకటస్వామిగౌడ్, రాజిరెడ్డి, లక్ష్మణ్‌రావు, విజయ, కళావతి, మానస, రేణుక, శరత్‌రావు, బూల, నారాయణరావు, మల్లేశం, భాస్కర్, ధార్నం లక్ష్మీనారాయణ, గజభీంకార్ రాజన్న, బండి దేవదాస్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.





నినాదాలు చేస్తున్న కేటీఆర్, పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

పేకాటరాయుళ్ల పట్టివేత

కథలాపూర్, ఏప్రిల్ 6: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. శివారులోని ఓ కొట్టంలో పేకాట ఆడుతున్నట్లు ఎస్సై నవీన్‌కు సమాచారం రావడంతో సిబ్బందితో అక్కడికి వెళ్లి పట్టుకున్నారు. ఐదుగురి నుంచి రు. 7,200లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, ఏప్రిల్ 6: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన నాగుల సతీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ నెల 2వ తేదీన నాగుల సతీష్‌కు చెందిన గొర్రెలు పుట్ట గంగాధర్‌కు చెందిన వరి పొలంలో మేశాయి. ఈ విషయంలో 3వ తేదీన పెద్ద మనుషుల సమక్షంలో పిలిపించి మాట్లాడుతుండగా సతీష్ కులం పేరుతో దూషించి చెప్పుతో కొట్టి అవమానించాడని గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సైబరాబాద్‌లో బాలిక కిడ్నాప్

- జగిత్యాలలో సంచారం, నలుగురిపై కేసు నమోదు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 6 :హైదారాబాద్ పట్టణంలోని సైబరాబాద్‌కు చెందిన ఓ బాలిక కిడ్నాప్‌నకు గురైనట్లు తెలిసింది. అయితే కిడ్నాప్‌నకు గురైన బాలిక కొన్ని రోజులుగా జగిత్యాల జిల్లా కేంద్రంలో సంచరిస్తున్నట్లు జగిత్యాల పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు జగిత్యాలతో పాటు మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన నలుగురు యువకులు బాలికను కిడ్నాప్ చేసినట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్ దగ్ధం



భూషణరావుపేటలో దగ్ధమైన హార్వెస్టర్

కథలాపూర్, ఏప్రిల్ 6 : మండలంలోని భూషణరావుపేటలో శనివారం ఉదయం విద్యుత్ తీగలు తగిలి రాగుల రవి అనే యజమాని హార్వెస్టర్ పూర్తిగా దగ్ధమైంది. గన్నెడ్డి కుంట శివారులో ఓ రైతుకు చెందిన వరి పొలం కోస్తుండగా పైభాగంలో ఉన్న ఎల్‌టీ విద్యుత్ తీగలు తగిలాయి. వైర్ల నుంచి నిప్పురవ్వలు ఇంజిన్‌పై పడడంతో మంటలు చెలరేగాయి. వరి పొలంలోనే మంటలు వ్యాపించడంతో భయాందోళనకు గురైన రైతులు ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. వ్యవసాయానికి సంబంధించిన వైర్లను చూసు కుని హార్వెస్టర్ యజమానులు వరి కోతల పనులు చేపట్టాలని విద్యుత్ అధికారులు సూచించారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడానికి అవకాశం ఉంటుం దన్నారు. సంఘట నా స్థలాన్ని ఎస్సై నవీన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం స్వామిరెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు పరిశీలించారు.

హైటెన్షన్ విద్యుత్ వైర్లు తాకి యువకుడి మృతి

సుల్తానాబాద్, ఏప్రిల్ 6: సుల్తానాబాద్ మండలంలోని మియాపూర్‌లో శనివారం ఓ వ్యాన్ రివర్స్ వస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు వ్యాన్‌కు తగిలి దానిని అనుకుని ఉన్న దొడ్ల గంగాదర్ అనే యువకుడు మృతి చెందాడు. మియాపూర్ గ్రామానికి చెందిన ఒక రైతు తన పొలంలో షెడ్డు నిర్మించుకుంటున్న సందర్భంలో దానికి అవసరమైన సిమెంట్ బ్రిక్స్‌ను గోదావరిఖని నుంచి వ్యాన్‌లో తెచ్చారు. వ్యాన్ పొలంలో దిగబడి పోవ డంతో వేరే ట్రాక్టర్ తెచ్చి ఇటుకలను ఇదే గ్రామానికి చెందిన హమాలీ పని చేసే దొడ్ల గంగాదర్(27) పనిస్థలానికి తరలించారు. తిరిగి వ్యాన్ రివర్స్ వెళుతుండగా గంగాధార్ దాన్ని తాకుతూ నిలుచున్నాడు. పైన ఉన్న 11 కేవీ హైటెన్షన్ వైర్లు వ్యాన్‌పై భాగంలో తాకి షాక్ రావడంతో గంగాధర్ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- ఈసీఈ హెచ్‌వోడీ ప్రభాకర్



మాట్లాడుతున్న హెచ్‌వోడీ ప్రభాకర్

కొడిమ్యాల, ఏప్రిల్ 6: ఇంజనీరింగ్ విద్యార్థులు విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని ఈసీఈ హెచ్‌వోడీ ప్రభాకర్ కోరారు. శనివారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో ఈ నెల 1న ప్రారంభమైన డిజిటల్ డిజైన్ అండ్ వెరీ లాగ్ ముగిసింది. ముగింపు సమావేశంలో ఈసీఈ హెచ్‌వోడీ మాట్లాడుతూ వర్క్ షాప్‌లో విద్యార్థులు వివిధ విభాగాల్లో డిజైన్ ఎనాలసిస్ వెరిఫికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ వెరీ లాగ్‌లో కోడింగ్ స్కిల్స్ ఏవిధంగా తర్ఫీదు అవ్వాలో నేర్పించామన్నారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృధా చేయకుండ కష్టపడి చదువుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ వర్క్ షాప్‌నకు రిసోర్స్ పర్సన్‌గా వచ్చిన డా.. సనత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో జ్ఞానాన్ని సంపాదించుకుంటూ అకుంఠిత దీక్షతో ముందుకు సాగాలన్నారు. భారత దేశ భవిష్యత్తు యువత మీద ఆధారపడి ఉందన్నారు. ఈ ముగింపు సమావేశంలో కో కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, కోఆర్డీనేటర్ శ్రీనివాస్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌ను బెదిరించిన ఇద్దరిపై కేసు

కోల్‌సిటీ, ఏప్రిల్ 6: విలేకరులమని తమకు రూ.10వేలు ఇవ్వాలంటూ రేషన్ డీలర్‌ను బెది రించిన ఇద్దరు వ్యక్తులపై శనివారం కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. తిలక్‌నగర్, ఫైవింక్లయిన్‌లో రేషన్ షాపు నిర్వహించే అవినాష్‌ను సురేష్, శివ అనే ఇద్దరు తాము విలేకరులమని, రూ.10వేలు ఇవ్వాలంటూ బెదిరించినట్టు పోలీసులు తెలిపారు. బాధితుడిఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఎండిన పంటలకు నష్ట పరిహారం అందజేయాలి



ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గంగాధర, ఏప్రిల్ 6: ప్రభుత్వం ఎండిన పంటలకు నష్ట పరిహారం అందజేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో మధురానగర్‌లో ఎండిపోయిన వరి పంటను పరిశీలించారు. ఈసందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేమేడిపల్లి సత్యం ఎక్కడ పొలాలు ఎండిపోలేదని చెప్పడం సరి కాదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, రేండ్ల శ్రీనివాస్, నారాయ ణ ,రాజశేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 6: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎల్ఎల్‌బీ ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీశ్రీరంగప్రసాద్ తెలిపారు. పరీక్షల ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మృత్యు శకటం

- విద్యార్థులను బలితీసుకున్న అతివేగం
- బోల్తా పడిన మొరం టిప్పర్
- మట్టిలో కూరుకుపోయి ముగ్గురు దుర్మరణం
- అన్నాచెల్లెళ్లు, సమీప బంధువు మృతి
- బోర్నపల్లిలో విషాదం




విజయ్, వర్ష, సింధుజా మృతదేహాలు

హుజూరాబాద్, ఏప్రిల్ 6: పెద్దమ్మతల్లికి మొక్కులు చెల్లించుకొని తిరుగు ప్రయాణం అవు తున్న వారిని విధి వెంటాడింది. మొరం టిప్పర్ రూపంలో ముగ్గురు చదువుకునే విద్యార్థులను మృత్యువు కబళించింది. మోటర్ సైకిల్‌పై ముగ్గురు ఇంటికి వస్తున్న క్రమంలో మొరం టిప్పర్ బోల్తా పడడంతో అదే మట్టిలోనే కురుకుపోయి అక్కడికక్కడే మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్లు, సమీప బంధువు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ హృదయ విదారక సంఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే హుజూరాబాద్ మున్సి పాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో పెద్దమ్మతల్లి బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గంట విజయ్ (17), గంట వర్ష (15), గంట సింధుజా (18) హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. నిద్ర వస్తుందని తల్లిదండ్రులకు తెలిపారు. ముగ్గురు కలిసి మోటర్ సైకిల్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో ఎలబోతారం నుంచి ఎదురుగా వస్తున్న మట్టి టిప్పర్ గమనించారు. మూల మలుపు ఉండడంతో విజయ్ మోటర్ సైకిల్‌ను నిలిపివేశాడు. అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన టిప్పర్ డ్రైవర్ వారిని ఆకస్మాత్తుగా గుర్తించి సడన్ బ్రేక్ వేయడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో బైక్‌పై ఉన్న ఉన్న ముగ్గురు మట్టిలో కురుకుపోయి శ్వాస అందకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు ఎక్స్‌కావేటర్ సహాయంతో మృతదేహాలను వెలికి తీసి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్లు విజయ్, వర్ష, బంధువు సింధుజా మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు, స్థాని కులు కంట తడి పెట్టారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుము క న్నాయి. గంట విజయ్ ఇంటర్, వర్ష పదో తరగతి, సింధుజా డిగ్రీ చదు వుతున్నారు. హుజూరాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● అతివేగంతో ఇబ్బందులు..

నేషనల్ హైవే పనులు జరుగుతుండడంతో టిప్పర్ డ్రైవర్లు అతివేగంగా వాహనాలు నడుపుతున్నారు. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 500 టిప్పర్లతో సైదాపూర్, హుజూరాబాద్ మండలాల్లోని గుట్టల్లో నుంచి మట్టిని తరలిస్తున్నారు. అనుభవం లేని యువ డ్రైవర్లతో టిప్పర్లు నడుపుతుం డడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో కూడా టిప్పర్ డ్రైవర్లు కార్లు, మోటర్ సైకిళ్లను ఢీ కొట్టిన సందర్భాలు ఉన్నాయి. బోర్నపల్లిలో జరిగిన సంఘటనతో పోలీసులు కళ్లు తెరిచి డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.



బోల్తా పడిన టిప్పర్

● మృతుల కుటుంబాలకు పరామర్శ..

బోర్నపల్లిలో ముగ్గురు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి చేరుకొని మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ మృతుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పోలీసుల దాడులు

అక్రమ వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారుల ఇళ్లపై

- రూ.16.13లక్షల నగదు, 359డాక్యుమెంట్లు స్వాధీనం

- జిల్లా వ్యాప్తంగా 14కేసులు నమోదు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 6: జిల్లావ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ, ఫైనాన్స్‌లు నిర్వహిస్తున్న వ్యాపారుల ఇళ్లపై శనివారం 24పోలీసు బృందాలు ఏకకాలంలో దాడులు చేశారు. జిల్లాలోని 13పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దాడులుచేసి రూ. 16.13లక్షల నగదు, 359డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకొని 14కేసులు నమోదుచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన నిబంధనలకు లోబడి ఫైనాన్స్ నిర్వహించాలని చెప్పారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుంచి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమకున్న అత్యవసర పరిస్థితి, తాత్కాలిక అవసరాల కోసం అధిక మొత్తంలో అవసరంకు మించి అధిక వడ్డీలకు అప్పుచేసి ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడి తమ కుటుంబాలకు ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్ధతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే విశ్వసించాలని చెప్పారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయినా అక్రమ ఫైనాన్స్ వ్యాపారం నడిపే వారి వివరాలు జిల్లా పోలీసు కార్యాలయంలో తనకు సమాచారం ఇవ్వాలన్నారు. డయల్ 100కు ఫిర్యాదుచేసినా చర్యలు ఉంటాయని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందన్నారు. అప్పు తీసుకోవడం , ఇవ్వడం నేరం కాదని, ఆర్‌బిఐ నిబంధనలు , మనిలెండింగ్ యాక్ట్ నిబంధనల ప్రకారం చట్టబ ద్ధంగా ఎవరైనా లైసెన్స్‌తో అప్పులు ఇవ్వొచ్చన్నారు. చట్ట విరుద్ధంగా అధిక వడ్డీ రేట్లతో సామాన్యులై దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, బొప్పాపూర్, తదితర గ్రామాల్లోని వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సుమారు పది మంది వ్యాపారుల ఇళ్లలో తనిఖీలు జరిపారు. నగదు, ప్రామిసరీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

వేములవాడ: వేములవాడ పట్టణంలోని వడ్డీ వ్యాపారులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. అధిక వడ్డీకి నగదు ఇస్తూ ఇబ్బందుల గురి చేస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక డీఎస్పీ కే నాగేంద్ర చారితో కలిసి చేపట్టిన ఈ దాడులలో భాగంగా పట్టణంలో పలువురు వడ్డీ వ్యాపారులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ ప్రవీణ్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు అంజయ్య, నాయుడు, పృధ్విగౌడ్, జ్యోతి తదితరులు తనిఖీలలో పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఒకరిపై కేసు

శంకరపట్నం, ఏప్రిల్ 6: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైనట్లు శనివారం పోలీసులు తెలిపారు. మండలంలోని గద్దపాక గ్రామానికి చెందిన చిత్తారి కిరణ్ అక్రమంగా మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి చెప్పారు. కిరణ్ వద్ద నుంచి 4.355లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినట్లు సమాచారం వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు.

మిస్సింగ్ కేసు నమోదు

వీణవంక, ఏప్రిల్ 6: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన అంబాల సమ్మయ్య రెండు రోజుల క్రితం ఇంటిలో కుటుంబ సభ్యులతో గొడవ పడి వెళ్లి పోయాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. బంధువుల ఇళ్లల్లో గ్రామంలో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వివాహిత అదృశ్యం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 6: భర్తతో గొడవపడిన వివాహిత అదృశ్యమైనట్లు ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన మనిషా(25) ఈనెల 3న తన భర్తతో గొడవ పడి రాత్రి 9:30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి అదే గ్రామంలోని బంధువుల ఇంటిలో ఆశ్ర యం పొందింది. 4న మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన అత్త ఇంటికి వెళ్తున్నట్లు చెప్పిన మనీషా బయటకు వెళ్లి ఇంతవరకు ఆచూకీ లేకుండా పోయిందని ఆమె తండ్రి దాసరి నరేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మనీషాకు ఇద్దరు కొడుకులు ఉన్నారని, తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 6: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు జైలుశిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీలలో పట్టుబడిన 21 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఇందులో నుంచి ఒకరికి ఏడు రోజులు, ఇద్దరికి ఐదు రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు. మిగతా 18 మంది వాహనదారులకు 31 వేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

వాగులో మునిగి కార్మికుడి మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 6: మండలంలోని చౌలమద్ది గ్రామంలోని బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం వచ్చి షిడం పోశం(40) అను కార్మికుడు ప్రమాదవశాత్తు వాగులో మునిగి శనివారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాల జిల్లా భీమారం మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన పోశం కూలి పనులు చేసుకంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య ఎనిమిదేళ్ల క్రితం చనిపోవడంతో నలుగురు సంతానంతో కలిసి ఉంటున్నాడు. పనులు కోసం చౌలమద్ది గ్రామంలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణంలో పని కోసం తోటి కూలీలతో కలిసి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం వాగులో తోటి కూలీలతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. తోటి కూలీలు చీకటి పడేంత వరకు వెతికినా ఫలితం లభించలేదు. శనివారం ఉదయం పోశం మృతదేహాన్ని గుర్తించారు. పోశం కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్నిక్ డిప్లామా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్6: హైదరాబాద్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు తల్లిదండ్రులను కోల్పో యిన అనాథ బాలికలు, తల్లి లేదా తండ్రి కోల్పోయిన బాలికలు, ఇతర నిరాశ్రయులైన పిల్లలు, చిల్డ్రెన్ హోం సంస్థల్లోని బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలు, వికలాంగుల బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లలో 60 చొప్పున సీట్లు ఉన్నాయని, మొత్తం 240 సీట్లకు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో గల బాల రక్షాభవన్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాల కోసం సంప్రదించాలని సూచించారు. పూరించిన దరఖా స్తులను మే15 సాయంత్రం 5 గంటలలోపు ధ్రువపత్రాలను జతచేసి సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఫోన్ 833-298-7862 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చిన్నారిని చిదిమేసిన ఆటో

- రోడ్డు ప్రమాదంలో 18 నెలల బాలుడి మృతి



సుధన్య(ఫైల్)

కోరుట్ల, ఏప్రిల్ 6: అప్పటి వరకు కుటుంబ సభ్యుల ముందు తప్పటడుగులు వేస్తూ.. వచ్చీ రాని మాటలతో అందరినీ ఆనందంలో ముంచెత్తిన ఆ చిన్నారి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. పోలీసులు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు.. పట్టణంలోని అంబేద్కర్ నగర్ ప్రాతంలో నివాసం ఉంటున్న పొట్ట రిషింద్ర - అపూర్వ దంపతులకు కుమారుడు సుధన్య (18 నెలలు) ఉన్నాడు. శనివారం ఉదయం సుధన్య ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే సమయంలో ఆ ప్రాంతంలో మంచి నీళ్ల సరఫరా చేయడానికి వచ్చిన ఆటో ప్రమాదవశాత్తూ చిన్నారిని ఢీ కొట్టడంతో సుధన్య ఆటో చక్రాల కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. చిన్నారి తండ్రి రిషింద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని ఒకరి మృతి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 6: ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని పెగడపల్లి శివారులో చోటుచేసుకుంది. శనివారం మండలంలోని పందిళ్ల గ్రామానికి చెందిన సూర తిరుపతి(45) తన భార్య స్వరూపతో కలిసి తన ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్ నుండి పందిళ్లకు వస్తుండగా మార్గమధ్యలో పెగడపల్లి శివారులో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొంది. దీంతో సూర తిరుపతికి తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, తిరుపతి భార్య స్వరూపకు స్వల్ప గాయాలయ్యాయి. తిరుపతికి భార్యతో పాటు కుమారుడు కూతురు ఉన్నారు. ఈ విషయంపై మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఓంకార్ యాదవ్ కేసు నమోదు చేసుకొని తిరుపతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్



విద్యార్థుల పత్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 6: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం మూడో రోజు జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రాంలోనే రెండు షిఫ్టులలో పరీక్షలు నిర్వహిచారు. మొదటి షిఫ్టులో 680 మందికి 608 మంది, రెండో షిఫ్టులో 672 మందికి 61 4 మంది పరీక్షకు హాజరయ్యారు. అభ్యర్థులను రెండు గంటల ముందు నుంచే పరీక్ష కేంద్రం లోనికి అనుమతించారు. ఎండ తీవ్రత కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్త కుండా తగిన ఏర్పాట్లు చేశామని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

నేతన్నలు ధైర్యం వీడొద్దు

- రాజకీయపార్టీల వల్లే వస్త్ర పరిశ్రమ సంక్షోభం
- గత ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు
- కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 6: సిరిసిల్ల మళ్లీ ఉరిశాలగా మారుపోతుందా అనే అను మానాలు వ్యక్తం అవుతున్నాయని, నేతన్నలు ధైర్యం వీడొద్దని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వీరయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం రాత్రి వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి మూడు రాజకీయ పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లేనన్నారు. కేంద్రం ప్రభుత్వం చేనేత, టెక్స్‌టైల్ శాఖలను రద్దు చేసి వస్త్ర పరిశ్రమలతోపాటు అనుబంధం రంగాల పరిశ్రమలపై 4 శాతం ఉన్న జీఎస్టీని 12 శాతానికి పెంచి భారం మోపిందని చెప్పారు. అంతే కాకుండా బహుళ జాతి కంపెనీలను ప్రోత్సహిస్తోందన్నారు. దీంతో చిన్నచిన్న పరిశ్రమల్లో సంక్షోభం రావడంతో నేతన్నలకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. సిరిసిల్లలో మూడు నెలలనుంచి వస్త్ర పరిశ్రమలు బంద్ కావడంతో నేతన్నలకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నెల రోజుల్లో ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకారమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలతోపాటు ఇతర వస్త్రాలకు సంబంధించిన బకాయిలతోపాటు యారన్ సబ్సిడీలను చెల్లించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కోపంతో సిరిసిల్లలో నేతన్నలకు ఉపాధిని కల్పించకుండా కక్ష్యసాధింపులకు పాల్పడుతోందన్నారు. మూడు నెలలనుంచి ఉపాధిని కల్పించేందుకు బతుకమ్మ చీరలతోపాటు ఇతర ప్రభుత్వ ఆర్డర్‌లను ఇప్పించాలంటూ నేతన్నలు పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని చెప్పారు. ఈ సమస్యకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యత వహించి ప్రభుత్వంతో పోరాటం చేసి నేతన్నలకు ఉపాధిని కల్పించాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు సంక్షోభంతో పాటు లక్షల్లో కరెంట్ బిల్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటని గతంలోనే పరిష్కారించాల్సి ఉండాల్సిందని చెప్పారు. అ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కరెంట్ బిల్లులు సైతం భారంగా మారిపోయా యన్నారు. సిరిసిల్లలో మరమగ్గాల కార్మికులను ఓనర్‌లు చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం తీసుకోచ్చిన వర్కర్ టూ ఓనర్ పథకం నిర్మాణాల దశలలోనే నిలిచిపోయిందని తెలిపారు. దీంతో ఇప్పటికి కార్మికులు ఓనర్‌లు కాలేకపోయారని అన్నారు. మూడు నెలలనుంచి ఉపాధిని కోల్పోయిన నేతన్నలు భిక్షటనలు చేసుకోని భోజనం చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. నేతన్నలు సమస్యలను పరిష్కారించు కునేందుకు నిత్యం పోరాటాలను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికైనా సిరిసిల్లలో నేతన్నల అకలి చావులను చూసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి ఉపాధిని కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరపాటి రమేశ్, జేఏసీ నేతులు మండల సత్యం, మంచె శ్రీనివాస్, మూషం రమేష్, కోడం రమణ, సిరిసిల్ల రవీందర్, మండల రాజు, పంతం రవి, వెల్దండి దేవదాస్, కట్టికోల లక్ష్మీనారాయణ, తాటిపాముల దామోదర్, మోర రాజు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన నేతన్నలు

అంతర్జాతీయ స్థాయికి దీటుగా ఫలితాలు అందిస్తున్న సంతాన సాఫల్య కేంద్రం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 6: సంతానం లేని దంపతులకు ఐవీఎఫ్ పద్ధతి ఒక వరం లాంటిదని పద్మజ సంతాన సాఫల్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ పద్మజ తెలిపారు. శనివారం ఆసుపత్రి సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాధునిక వైద్య విధానాలు, సంతాన సాఫల్యంలో అద్భుత ఫలితాలు సాధించడం కరీంనగర్‌లోని పద్మజ సంతాన సాఫల్య కేంద్రానికే దక్కుతాయన్నారు. 25 సంవత్సరాల క్రితం కరీంనగర్‌లో ప్రారంభమైన పద్మజ సంతాన సాఫల్య కేంద్రంలో అంతర్జాతీయ స్థాయికి దీటుగా ఫలితాలు ఇస్తున్న సంతాన సాఫల్య కేంద్రం తమదేనని అన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి వచ్చి సంతానం పొందిన దంపతులు వేల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఒకే రోజులో ఒకే కాన్పులో ఇద్దరు, ముగ్గురు సంతానం కలిగిన దంపతులు ఉన్నారని తెలిపారు. వారం దరినీ ఈరోజు ముందుకు తీసుకు వచ్చామన్నారు. పిల్లలు లేని దంపతులకు స్త్రీ, పురుషుల పునరుత్పత్తి వ్యవస్థ ద్వారా ఐవీఎఫ్ ఒక అద్భుత వరమన్నారు. ఐవీఎఫ్ విధానంలో భార్య అండాశయం నుంచి అండాలను బయటకు తీసి, భర్త వీర్యకణాలను అండంలోకి ఇంజెక్ట్ చేసి ఇంక్యుబేట్ చేస్తామని తెలిపారు. మూడు రోజుల తరువాత ఫలదీకరణ చెందిన పిండాన్ని తిరిగి గర్భాశయంలో ప్రవేశ పెడుతామని పేర్కొన్నారు. ఐవీఎఫ్ పద్ధతి కోసం వినియోగించే పరికరాలు అన్నీ విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నవేనని తెలిపారు. అయితే వాటితో వైద్యం చేయడం కూడా ఖర్చుతో కూడుకున్నదన్నారు. అంతర్జాతీయ సక్సెస్ రేటు 35 శాతం నుంచి 40 శాతం కాగా, ఇక్కడ 70 నుంచి 75 శాతం సక్సెస్ ఇస్తున్నామన్నారు. తమ సక్సెస్ రేటును చూసే దేశ విదేశాల నుంచి తమ వద్దకు సంతానం కోసం వస్తున్నారని తెలిపారు. గర్భధారణ అయినవారి కళ్లల్లో ఆనందం చూశాక తాము పడిన శ్రమ మర్చిపోయి తిరిగి మరింత ఉత్సాహంగా పనిచేయాలనిపిస్తుందన్నారు.

ఈ పద్ధతి గురించి ఎన్నో అపోహలు, ఆటంకాలను దాటుకొని ఫర్టిలిటీలోని ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ మాతృత్వాన్ని ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం ఎన్నో ఐవీఎఫ్ సెంటర్లు ఉన్నప్పటికీ వస్తున్న ఫలితాలే తమ అభివృద్ధికి సోపానాలని పేర్కొన్నారు.


పద్మజ సంతాన సాఫల్య కేంద్రంలో ఒకే రోజు ఐవీఎఫ్ పద్ధతి ద్వారా మాతృత్వం పొందిన మహిళలు

రైతుల పక్షాన మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 6: వడగళ్ల వానలతో నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ.10వేలు ఇస్తామని అధికారంలో ఉండగా జీవో తీసుకొచ్చి అనాపైన రైతులకు ఇవ్వని కేసీఆర్‌కు ఈ రోజు రైతుల పక్షాణ నిలబడి మాట్లాడే అర్హత లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించిన కేసీఆర్ మాటలను తప్పుబడు తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని జిత్తులమారి నక్కలా పాలించిన వైనాన్ని ప్రజలు గమనించి బీఆర్ఎస్‌ను పక్కన పెట్టారన్నారు. ప్రజాపాలన కోసం కాంగ్రెస్‌కు అవకా శం ఇచ్చిన సందర్భాన్ని జీర్ణించుకోలేక కేసీఆర్ చేస్తున్న ఆరో పణలను గమనిస్తున్నారన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన వైనా న్ని, వరంగల్‌లో మిర్చి రైతులపై లాఠీచార్జి చేయించిన వైనాన్ని కేసీఆర్ మర్చిపోయారన్నారు. గతంలో జిల్లాలో వడగళ్ల వానలతో దాదాపు పది వేల ఎకరాల నష్టం జరిగితే రూ.10 వేల చొప్పున ఇచ్చారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధర్నా చౌక్‌ను ఎత్తివేశారని, ప్రశ్నించే గొంతులను నొక్కి అరెస్టులు చేయించారని మండిపడ్డారు. తొమ్మిదిన్నర సంవత్సరాలు జిల్లాకు వచ్చిన ప్రతీసారి ప్రతిపక్ష పార్టీ నాయ కులను అరెస్టులు చేయించారని, పోలీస్ స్టేషన్‌లో నిర్బం ధించారని అన్నారు. కేటీఆర్ ఈ రోజు రైతు దీక్ష చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వరి వేస్తే ఉరే సన్నరకాలే వేయండి అని రైతులకు చెప్పి ఫాంహౌస్‌లో దొడ్డు రకం బియ్యం పం డించిన కేసీఆర్ కన్నీరు పెట్టే కపట ప్రేమను ప్రజలు, రైతులు గమనించాలని కోరారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగితే 10 టీఎంసీల నీరు వదిలేసింది మీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నిం చారు. వాస్తవాలు ప్రజలకు తెలియాలని మేడిగడ్డకు రావాలని కోరితే ఎందుకు ముఖం చాటేశారన్నారు. శ్రీశైలం, నాగార్జన సాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు దాదాపు 50 సంవత్సరాలు సేవలను అందిస్తే కాళ్లేశ్వరం మేడిగడ్డ మూడు సంవత్సరాలు కాకముందే పగిలిపోయింది నిజం కాదా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు మాసాలు కాలేదు 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకు న్నారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతులను అడ్డు పెట్టుకొని వస్తున్న తండ్రీకొడుకులు, బావ బావమరిది దుష్ప్ర చారాన్ని తిప్పికొట్టడానికి ముందుకు వచ్చా మన్నారు. కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చింది అన్న వాని మాటలకు నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదన్నారు. 2023 నవంబర్ 30న ఎన్నికలు జరిగితే డిసెంబర్ 3న కౌంటింగ్ 7న ముఖ్య మంత్రిగా రేవంత్‌రెడ్డి, మంత్రులు బాధ్యతలను తీసుకున్నార న్నారు. గోదవరి నీళ్ల వదిలింది మీరు కాదా అన్నారు. ఢిల్లీ నుంచి నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు వచ్చి అన్నారంలో ఉన్న రెండు టీఎంసీలు విడదల చేయకపోతే అన్నారం బ్యారేజీకి ప్రమాదాం అని చెప్పాకే విడుదల చేసినట్లు చెప్పారు. తెలంగాణలోని 37 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని మాటిచ్చి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ 14 లక్షల మంది రైతులకు రుణమాఫీ రూ. 7100 కోట్లు ఎగ్గొట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందన్నారు. లోక్ సభలో ఒక్క సీటు కూడా రాదన్న ఆందోళనతో కేసీఆర్ మతిలేని మాటలు మాట్లాడుతున్నారని, మేము కూడా కుక్కల కొడుకుల్లారా... మీ హయాంలో ఏం చేశార్రా అనవచ్చని, కానీ సభ్యత గుర్తుకొస్తుందని అన్నారు. జిల్లాలో నేతన్నల గురించి మాట్లాడే వారు నాడు రూ. 275 కోట్లు బతుకమ్మ చీరల బకాయిల ఇవ్వలేక పోయారన్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం కోల్పోయి మరోవైపు కూతురు లిక్కర్ స్కాంలో జైలుకి వెళ్లడం, ఫోన్ ట్యాంపింగ్ వ్యవహారాల్లో బండారం బయట పడుతుందన్న గుబులుతో కేసీఆర్ మతిభ్రమించి మాట్లాడుతు న్నాడన్నారు. టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షుడు దేవయ్య జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు వనిత, పట్టణ అధ్యక్షురాలు స్వరూపతిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు రవి, రవి కుమార్, రామానుజం, రెడ్యానాయక్, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సయ్య సిరిసిల్ల అర్బన్‌బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రవీందర్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, జగన్, నాయకులు శివప్రసాద్, రాజు, కోడం శ్రీనివాస్, కళ్యాణ చక్రవర్తి, అహ్మద్, ఆయాన్, నవీన్, చోటు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం


ఆహ్వానం అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 6: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో ఈ నెల 12 నుంచి నిర్వహించనున్న శివ పంచాయతన ప్రాణ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ అంబేద్కర్ సంఘం నాయకులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను శనివారం ఆహ్వానించారు. ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి సన్మానించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే సత్యం రూ.50 వేల నగదును అందజేశారని సంఘం సభ్యులు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా శనివారం కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనిధి, డ్యాన్స్‌టీచర్ సునందలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

ముస్తాబాద్, ఏప్రిల్ 6 : మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన చేపూరి రాజయ్య (85) అనే సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు శుక్రవారం గుండెపోటుతో మరణించగా ఎమ్మెల్యే కె.తారకరామారావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ విజయరామారావు, నక్కదాసరి రవి తదితరులున్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు

వేములవాడ, ఏప్రిల్ 6 : వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శనివారం ముందస్తుగా ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి ప్రయోజనాలు, ఔషధ గుణాల గురించి పాఠశాల కరస్పాండెంట్ శ్రీసన్నిధి వెంకటకృష్ణ వివరించారు. ప్రిన్సిపాల్ కళ్యాణ్‌కుమార్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 6: సిరిసిల్ల పట్టణం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో లెప్రసీ నోడల్ సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీపై శిక్షణ ఇచ్చారు.జిల్లా ప్రోగ్రం అధికారులు రజిత, శ్రీరాములు, నయింజ, డీపీఎంవోలు కాశీనాథ్, శ్రీనివాస్, కూన సురేష్, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్న కుటుంబానికి వీరయ్య పరామర్శ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 6 : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సిరిపురం లక్ష్మీనారాయణ ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని శనివారం సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వీరయ్య పరామర్శించారు. తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, మూషం రమేష్ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చే వరకు నిలదీస్తాం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 6: కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు గ్రామాల్లో నిలదీస్తామని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయం ఆవరణలో శనివారం స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. రైతు బంధు, రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ, ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని అన్నారు. నాయకులు కృష్ణహరి, సుభాష్, శంకర్‌నాయక్, సీత్యానాయక్, రాజునాయక్, శంకర్, మధు, అనిల్, సురేష్, సాయిలు, రవీందర్, నాగరాజు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

చందుర్తి, ఏప్రిల్ 6 : రోడ్డు భద్రత నియమాలు పాటించాలని చందుర్తి ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. చందుర్తి, మల్యాల గ్రామాల మధ్య శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. మద్య మత్తులో వాహనాలు నడపవద్దన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

చందుర్తి, ఏప్రిల్ 6: ఉపాధి హామీ పనులకు కూలీలు ఎక్కువ హాజరయ్యేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏపీవో రాజయ్య సూచించారు. చందుర్తి మండలం రామారావుపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులతో పాటు, కిష్టంపేట గ్రామంలోని నర్సరీని శనివారం పరిశీలించారు.

ఎంపీపీ భర్తపై చర్యలు తీసుకోవాలి

వీర్నపల్లి, ఏప్రిల్ 6: వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండాలో ఎంపీపీ భర్తపై చర్యలు తీసుకోవాలని తండావాసులు, యువకులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధితో కలిసి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారని, ఇప్పుడు యువకులు క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసుకోగా ఆ స్థలంలో క్రీడలు ఆడరాదని యువకులతో వాగ్వాదానికి దిగారని పేర్కొన్నారు. శనివారం పలు తండాల్లో తాగునీరు రాకుండా పంచాయతీ బోరు మోటర్ల ఫీజులను తీసుకెళ్లినట్లు ఆరోపించారు. ఇదే విషయంపై వివరణ కోరగా ఎంపీవో స్పందించలేదు. బోరు మోటార్ల ఫీజులను స్వాధీనం చేసుకొని అన్ని తండాలకు తాగునీటిని సరఫరా చేసినట్లు పంచాయతీ కార్యదర్శి బుగ్గరాములు తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం


దీక్షలో పాల్గొన్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, ఏప్రిల్ 6 : రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేంతవరకు రైతుల పక్షాన కొట్లాడుతామని వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో నియోజకవర్గస్థాయి రైతు నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలోనే పండిన పంటకు బోనస్ ఇస్తామని గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పారని, ఇప్పటికైనా ధాన్యానికి 500 రూపాయల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కరువుతో వందలాది ఎకరాలు ఎండిపోయాయని, ప్రతీ ఎకరాకు 25 వేల రూపాయల నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఎకరాకు పదిహేను వేల రైతుబంధు ఇవ్వాలని, రెండు లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. వీటన్నింటిపై రైతుల పక్షాల నిలబడి ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, ఎంపీపీలు బండ మల్లేశం యాదవ్, చంద్రయ్య గౌడ్, జడ్పీటీసీలు మ్యాకల రవి, నాగం భూమయ్య, పార్టీ అధ్యక్షులు గోస్కుల రవి, మల్యాల దేవయ్య, మ్యాకల ఎల్లయ్య, కమలాకర్, సత్తిరెడ్డి, కందుల క్రాంతి కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, రాఘవరెడ్డి, కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, గోలి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు తిరస్కరించినా అహంకారం తగ్గలేదు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 6: ప్రజలు తిరస్కరించిన బీఆర్ఎస్ నాయకుల అహంకారం తగ్గలేదని తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అహంకారంతో బీఆర్ఎస్ పార్టీ పాలన సాగిందని, ప్రజలను భయాభ్రాంతులకు గురి చేశారని అన్నారు. సిరిసిల్లలో కేసీఆర్ కల్లు తాగిన కోతిలా మాట్లాడడం సిగ్గు చేటన్నారు. కుక్కల కొడకా అని మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవక తవకలపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. అధికారం పోయాక పద్మ శాలీలపై కపట ప్రేమ చూపిస్తున్నారని, అధికా రంలో ఉన్నపుడు చేనేతకు ఏం మేలు చేశారో చెప్పాలని అన్నారు. చేనేత కార్మికుల శ్రమను దోచు కొని రూ.250 కోట్ల బకాయిలు పెట్టారన్నారు. అధి కారంలో ఉండి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌లు చేసి కేటీఆర్ ఎమ్మెల్యేగా గెలిచారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌లో కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని, ఇప్పటికే కూతురు లిక్కర్ స్కాంలో జైలుకు పోయిందని కేసీఆర్‌కు భయం పట్టుకుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అహంకార మాటల వైఖరికి ప్రజలే తగిన బుద్ధి చెప్పారన్నారు. గతంలో బాలమల్లుపల్లి, బస్వాపూర్ లో రైతులు పంట నష్టపోతే ఎప్పుడైనా పరామ ర్శించారా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష లీడర్‌గా హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు పుర్మాణి లింగారెడ్డి, మోర రాజు, నేరెళ్ల నర్సింగం, మచ్చ శ్రీనివాస్, రాపెల్లి ఆనందం, భైరినేని రాము, చుక్క శేఖర్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన చరిత్ర గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా పంటలు పరిశీలించడానికి వచ్చి కేసీఆర్ మాట్లాడిన తీరు విస్మయానికి గురిచేస్తోందన్నారు. ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు తలారి నర్సింలు, శీల ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ మండల , పట్టణ అధ్యక్షులు రంజాని నరేశ్, తాళ్ల విజయ్‌రెడ్డి, సోషల్ మీడియా మండల అధ్యక్షులు ఎదూనూరి భానుచందర్ తదితరులు పాల్గొన్నారు,

జన జాతర సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 6: కాంగ్రెస్ తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర సభకు నాయకులు తరలివెళ్లారు. ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, నాయకులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు శనివారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కోరారు. అనంతరం వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. నాయకులు లక్ష్మారెడ్డి, బాబు, గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, తిరుపతి, రాజేశం, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, రాజునాయక్, మల్లారెడ్డి, భూపాల్‌రెడ్డి, రవి, రఫీక్, దేవయ్య, బాల్‌రెడ్డి, నర్సయ్య, రాములు, మహేందర్ పాల్గొన్నారు.

కోనరావుపేట : కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన జాతర సభకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో నాయకులు శనివారం తరలివెళ్లారు.


కోనరావుపేట నుంచి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి: రుద్రంగి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి, పార్టీ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, తర్రె మనోహర్, ఎర్రం గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, పిడుగు లచ్చిరెడ్డి, మహిపాల్, లింగం, ఆరవింద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు


మెడల్స్, సర్టిఫికెట్లతో విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 6: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో శనివారం స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలను నిర్వహించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గోల్డ్, సిల్వర్, బ్రౌన్ మెడల్స్ సాధించారు. స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అక్కనపల్లి వినోద్ విజేతలకు పతకాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను మే 1, 2 తేదీల్లో వనపర్తిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్, కోచ్‌లు ఎనగందుల శ్రీనివాస్, మాస్టర్ దివ్య, మాస్టర్ ప్రియాంక, రిఫరీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ది మోసం.. కాంగ్రెస్‌ది సంక్షేమం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 6: పదేళ్ల కాలంలో పంటలు నష్టపోయిన ఆదుకోకుండా రైతులను బీఆర్ఎస్ మోసం చేసిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమం కోసం పాటు పడుతోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ పొలం బాట పేరిట పంటలను పరిశీలించి ఆదుకోవాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని రైతులు అధికారం కోల్పోగానే గుర్తొచ్చారా? అని ప్రశ్నించారు. రైతులపట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగిపోయి 60 టీఎంసీల నీరును సముద్రం పాలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. 12, 13వ ప్యాకేజీ కాలువల ద్వారా సిద్దిపేట, మెదక్ జిల్లాలకు నీటిని తరలించుకుపోయారని, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మల్కపేట 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఈ ప్రాంతాన్ని పడావు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రీకొడుకులు చేసిన తప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేయడం సిగ్గు చేటన్నారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నయా పైసా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని ధ్వజమెత్తారు. ఇటీవల నష్టపోయిన ప్రతీ ఎకరాకు రూ.10 వేలు చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారం చేస్తే రైతులు, ప్రజలు తిరగబడతారని గ్రహించి పొలం బాట పట్టారని, అన్నదాతలకు చేసిందేమీ లేదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్, ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యతా లోపం, అవినీతి, అక్రమాలకు పాల్పడిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, రవీందర్‌రెడ్డి, కిషన్, బాల్‌రెడ్డి, రాంరెడ్డి, రఫీక్, ముత్యంరెడ్డి, అంజనేయులు, శ్రీపాల్‌రెడ్డి, రాజు, కిషన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చందుర్తి, ఏప్రిల్ 6 : వేములవాడ నుంచి చందుర్తి మండలం ఎనగల్ శివారులోని ఓ రైస్ మిల్లుకు అక్రమంగా కారులో తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన రమేష్ అనే వ్యక్తి కారులో ఎనగల్ గ్రామ శివారులోని ఓ రైస్ మిల్‌కు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు


వేములవాడలో జెండా ఆవిష్కరిస్తున్న ప్రతాప రామకృష్ణ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 6 : సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్ మాట్లాడుతూ పార్లమెంటరీ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంటరీ నుంచి బరిలో ఉన్న బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. 1980 ఏప్రిల్ 6న దివంగత మాజీ ప్రధాని భారత రత్న అటల్ బీహరీ వాజ్‌పేయ్, ఎల్‌కే అద్వానీల ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీని ప్రారంభించినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో పార్టీ ముందుకు పోవడంతోపాటు రెండు సార్లు కేంద్రంలో అధికారంలో కొనసాగుతోందన్నారు. ఈ సారీ జరిగే ఎన్నికల్లో మరో సారీ బీజేపీకి అవకాశం ఇచ్చేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకవచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు పండుగ మాధవి, గాజుల సదానందం, గాజుల వేణు, కోడం అనంద్‌బాబు, సుంకరి బాలకిషన్, ఉరగోండ రాజు, సుంచు ప్రకాష్, తాటిపాముల సత్యం, గోసికొండ అంబదాస్, మ్యాన బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో శనివారం పార్టీ జెండాలను ఆవిష్కరించారు. టిఫిన్ బైఠక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా దేశానికి గుర్తింపు వచ్చిందంటే బీజేపీ పరిపాలనే కారణం అన్నారు. మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిప్పారపు శ్రావణ్, మాజీ మండల అధ్యక్షులు నాగసముద్రాల సంతోష్, దేశెట్టి శ్రీనివాస్, నాయకులు మ్యాకల మల్లేశం, ముత్తక్క, చంద్రం, గైని శ్రీనివాస్, అనీల్ బీరయ్య పాల్గొన్నారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భవ దినోత్సావాన్ని మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. దేశాభివృద్ధి కోసం బీజేని ఆదరించాలన్నారు. జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, పట్టణ అధ్యక్షులు మెంగని మహేందర్, ప్యాక్స్ డైరెక్టర్ యేళ్ల గిరిధర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు వరి వెంకటేశ్, నాయకుల్యు బాధ నరేశ్, శ్రీనివాస్‌రావు గోపి,దీటి సత్తయ్య, సత్యం, బుర్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలు శనివారం వేములవాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశాన్ని అవినీతి రహితంగా తీర్చిదిద్దిందన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దడానికి ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న నిరంతర కృషికి ప్రజలు, కార్యకర్తల అండగా ఉండాలని కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ని గెలిపించడం ద్వారా నరేంద్ర మోదీని మరోసారి ప్రధానమంత్రిని చేయాలని కోరారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కోల కృష్ణ స్వామి, పిన్నింటి హనుమండ్లు, చందనం సత్య నారాయణ, మనోజ్, రాహుల్, నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలు శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయ ఆవరణలో మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల ప్రధాన కార్యదర్శి చెట్టిపల్లి రవికిషోర్, మండల ఉపాధ్యక్షుడు సందేసారి మల్లికార్జున్, ఎగుర్ల అనిల్, కార్యదర్శులు గోపు ప్రవీణ్, దానే తిరుపతి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు గొల్లపల్లి వెంకటేష్, ప్రధకార్యదర్శి కావేరి రాజు, బిజెవైఎమ్ అధ్యక్షుడు జంగం వంశీ, బూత్ అధ్యక్షుడు తోట శేఖర్, గుమ్మడి శ్రీనివాస్, తిరుపతి, నరేందర్ పాల్గొన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, మండల నాయకులు బెంద్రె శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్, మోహన్ పాల్గొన్నారు.

చందుర్తి : నిరంతరం దేశ శ్రేయస్సును కోరుకునేది బీజేపీ అని ఆపార్టీ చందుర్తి మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేష్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో జెండాను ఆవిష్కరించారు. టిఫిన్ బైఠక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ, అభివృద్ధిలో రాజీలేని పోరాటం బీజేపీతోనే సాధ్యమైందన్నారు. రానున్న ఐదేళ్లలో దేశంలో మరిన్ని గొప్ప నిర్ణయాలకు మోదీ సర్కారు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధక్షుడు సిరికొండ శ్రీనివాస్, చిర్రం తిరుపతి, లక్కర్సు శశికుమార్, సిరికొండ తిరుపతి, మేడిశేట్టి శ్రీహరి, రాజు, సతీష్ వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్లలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు